# మహాప్రస్థానం

**వా**ళ్ళు ఒకచోట నిలవరు. కొండలూ, గుట్టలూ, నదులూ, వాగులూ, అరణ్యాలూ, అడవులూ దాటి ప్రయాణం చేస్తూనే ఉంటారు. వాళ్ళకి స్వక్షేత్రమంటూ లేదు.

వాళ్ళంతా అయిదువందల కుటుంబాలు. అందరూ ఒక్క ముసలిదాని సంతతివాళ్ళు, ఆ ముసలిదాని పేరు మనవి. వీళ్ళంతా మానవులు. తన సంతతి వాళ్ళందరినీ ప్రస్థానం పంపిన మనిషి ఆ మనవి.

"మీరంతా వెళ్ళి, ఒక మహానగరం కట్టండి. ఎక్కడ కట్టాలో మీకేతెలుస్తుంది. అది కట్టవలసినచోటు చేరేవరకూ మీరు ఆగరాదు. ప్రయాణం చేస్తూనే ఉండాలి" అని శాసించింది మనవి.

ఇప్పుడు ప్రయాణం చేసేవారిలో ఏ ఒకడూ మనవిని స్వయంగా చూడలేదు. వీళ్ళందరూ ప్రస్థానంలో పుట్టినవాళ్ళే. వీళ్ళ తండ్రులూ తాతలూ కూడా ప్రస్థానంలోనే పుట్టారు.

మనవిని గురించి, మహాప్రస్థానంలో జరిగిన సంఘటనలను గురించి రకరకాల కథలూ పాటలూ బయల్దేరాయి. అవే ఆ మానవుల సాహిత్యం. అందులో ఉన్న అనేక విషయాలు ఈనాడు మనం అక్షరాలా నమ్మలేం. మనవి ఏడువేల సంవత్సరాలు బతికిందనీ, ఆవిడ మహాబలశాలి అనీ, ఆవిడ గర్భాన రెండువేల సంతానం కలిగిందనీ, ఆవిడ భల్లూకాసురుణ్ణీ, పదితలల సింహాన్నీ చంపిందనీ, ఒకసారి పిడుగుల వానకురిస్తే తన పిల్లలను రక్షించుకునేందుకు ఒక కొండ అడ్డంగా పట్టుకున్నదనీ కథలు చెబుతారు. మొత్తానికి మనవి అనే మనిషి ఒకతె ఉండి ఉంటే, అదీ దాని సంతతివాళ్లూ కొండల్లోనూ, అడవుల్లోనూ ఉండేవారని తోస్తుంది. మహాప్రస్థానం పాటలు వింటే దానికి మొదటి నాయకులుగా ఉన్నవాళ్ళు తోళ్ళు కట్టుకున్నారనీ, అంబులూ, బాణాలూ తప్ప పనిముట్లు ఎరగరనీ తోస్తుంది. ఆ నాయకుల శౌర్య పరాక్రమాలు ఆ పాటల్లో అద్భుతంగా వర్ణించబడ్డాయి. అనేకచోట్ల ఈ మానవులకు ఇతరజాతులతో పోట్లాటలూ యుద్ధాలూ జరిగాయి. ఒకసారి మానవులు దాదాపు నిర్మూలమైనంత పనికూడా జరిగింది. కాని మళ్ళీ ఈ జాతి తెప్పరిల్లుకున్నది.

ప్రస్థానం వారికి పరమార్థం. మనవి చెప్పిన మాటలన్నీ ఒక చిన్న గీతంలో ఇమిడి ఉన్నాయి. ఈ గీతం చూసినట్టయితే ఈ మానవుల ధర్మాలన్నీ వ్యక్తం కావు. మానవులు ఇట్లా ఎంతకాలం ప్రస్థానం సాగించాలి? ఒక ప్రదేశంలో విడిస్తే అక్కడ ఎంత కాలం ఉండవచ్చు? పురుళ్ళూ పుణ్యాలూ వస్తే ఆగాలా? మానవుల్లో కొందరు చీలిపోయి ఇతర జాతులవాళ్ళతో చేరిపోతే వారిని శిక్షించాలా, వొదిలేసెయ్యాలా? ఒక కొండగాని, నదిగాని అడ్డొస్తే ఎటు ప్రయాణం సాగించాలనే విషయం అభిప్రాయభేదాలొస్తే ఎవరిమాట మిగతావాళ్ళు వినాలి? ఇటువంటి ధర్మసందేహాలన్నీ మానవులకు బ్రహ్మాండమైన సమస్యలు అయినై. కొన్ని విషయాలమీద రక్తపాతం కూడా జరిగింది. కాని కాలక్రమాన మనవి చేసిన శాసనం మీద భాష్యం ఏర్పడింది. రెండు మూడు భాష్యాలు కూడా బయల్దేరాయి. అనేకమంది చీలిపోయినారు. ఇట్లా చీలిపోయినవారు ఇతర జాతుల్లోచేరి బాగుపడ్డారు. కొందరు కష్టాలపాలై నశించారు. నశించినవారిని గురించి మానవులు పాటలల్లి, మనవి చేసిన శాసనాన్ని ఉల్లంఘించడం మహాపాతకమని నీతికూడా చెప్పారు. మహానగరం స్థాపించటం మాట ఎవరికీ పట్టలేదు. అది ఎప్పటికీ జరిగేదికాదని తెలిసిపోయింది. ప్రస్థానమే ఒక పరమార్థమయింది. మనవి సంతతివాళ్ళు సూర్యచంద్రాదులున్నంతకాలమూ ఎక్కడికో వెళ్ళుతూ ఉండవలసిందే.

మొదట్లో ఉండేవో లేవోగాని రానురాను మానవుల్లో వర్గాలు ఏర్పడ్డాయి. పాటలు చూస్తే అందరు మానవులూ ఒక తల్లి బిడ్డలే అని ఉన్నా, ఈ అయిదువందల కుటుంబాల్లోనూ యాభైకుటుంబాలు అగ్రజాతివి. వాళ్ళు ఇతర జాతుల సంపర్కంవల్ల మిగిలిన వాళ్ళకన్న కొంచెం పచ్చగా ఉండేవాళ్ళు. ఇతర జాతుల దగ్గిర దొంగిలించిన గొర్రెలనూ, మేకలనూ పెంచడం నేర్చుకున్నారు; గొర్రెబొచ్చుతో దారం అల్లి గుడ్డలు నేయటం నేర్చారు. అందుచేత వాళ్ళు అగ్రవర్ణంవాళ్ళు. నాయకులు వాళ్ళలోనుంచే రావాలి.

అయితే ఇప్పుడు అగ్రవర్ణం వాళ్ళకి వర్ణమే మిగిలింది. పశువుల్ని చూసేదీ, ఉన్ని నుంచి దారం తీసేదీ, విడిసినప్పుడు బట్టలల్లేదీ అంతా తక్కువ వర్ణం వాళ్ళే. విడిసినప్పుడు చెట్ల కొమ్మలు కొట్టి గుడిసెలు వేసేదీ, నడిచేటప్పుడు అగ్రవర్ణం వాళ్ళ వస్తువాహనాలు మోసేదీ తక్కువ వర్ణం వాళ్ళే.

ఎక్కడ ఎంతకాలం మకాం వెయ్యవచ్చుననేదాన్ని గురించి ఎవరి భాష్యాలూ అమలు జరగలేదు. అడవిఫలాలూ వనమృగాలూ సమృద్ధిగా ఉన్నచోట నెలరోజులు మకాం వేసేవాళ్ళు. చెట్లన్నీ ధ్వంసం చేసి, చుట్టు ప్రక్కల ప్రదేశమంతా దుర్గంధపూరితం చేసి మకాం ఎత్తేవాళ్ళు. కొల్లగొట్టటానికి తప్ప జానపదాలకేసి వెళ్ళేవారుకారు. సామాన్యంగా

నదులూ, కొండలూ, అడవులూ కలిసి వచ్చేచోట్లు వాళ్ళ ఆచార వ్యవహారాలకు అనుకూలించేవి. అందుచేత వాళ్ళు వాటిమీద పాటలు రాసి అవి ప్రార్థనలకింద చదివేవారు.

❀ ❀ ❀ ❀ ❀

మానవులు ఈ మహా ప్రస్థానంలో ఒకసారి విడిసినచోటికి మళ్ళా రావచ్చునా అనేది ఒక పెద్ద విప్లవానికి దారితీసింది. అగ్రవర్ణంవారు ఏకగ్రీవంగా రావచ్చునన్నారు. తక్కువ వారిలో కొందరు రాకూడదన్నారు. తర్కం జరిగింది.

రాకూడదన్నవారిలో ప్రముఖుడు మనవడు. మహాప్రస్థానం యొక్క ఆశయం ఏమిటి? మనవిచేసిన శాసనం ఇప్పటివరకూ ఎందుకు అమలు జరగలేదు? ఈ అగ్రవర్ణులు జాతిని నడిపించే బాధ్యత తమమీద వేసుకుని ప్రస్థానం సాగిస్తున్నారు కదా. ఇంతవరకూ ఎక్కడా నగరం ఎందుకు కట్టలేదు? ఒక స్థలం చూసి అక్కడ నగరం కట్టకుండా ముందుకు పోయినాక మళ్ళీ అక్కడికే రావటంలో అర్థమేమిటి? అని మనవడు సవాలు చేశాడు పెద్దల్ని.

పెద్దలు వాడిమీద విరుచుకుపడ్డారు. "వీడు ప్రస్థానానికి అపచారం చేస్తున్నాడు. అగ్రవర్ణంవారిని ఎదిరిస్తున్నాడు. మనవిని మనిషికింద జమకడుతున్నాడు. మన వేదం అపౌరుషేయమనేది శంకించి దానిమీద తర్కప్రయోగం చేస్తున్నాడు" అని అగ్రవర్ణులు మనవణ్ణి గురించి న్యాయసభ జరిపి, వాణ్ణి జాతిద్రోహిగా నిర్ణయించి, వాణ్ణి సజీవంగా రెండు నిలువుల లోతున పూడ్చిపెట్టారు.

ఇది పెద్ద పొరబాటుగా పరిణమించింది. నీచవర్ణులందరూ ఒక్కసారిగా మారినట్టయిపోయినారు. వారి చూపులూ, వాలకమూ, వాళ్ళలో వాళ్ళు మాటాడే ధోరణీ అగ్రవర్ణులతో మాటాడే ధోరణీ - అంతా మారిపోయినై. వాళ్ళు అగ్రవర్ణం వారికి అర్థంకాకుండా మాట్లాడుకునేటందుకు సాంకేతిక పదజాలం కూడా కల్పించుకున్నారు. పైకి వారి జీవితం మామూలుగానే వెళ్ళిపోతున్నప్పటికీ ఈ నీచవర్ణులకూ, అగ్రవర్ణులకూ మధ్య అగాథం ఏర్పడింది.

పాతకానికి పరిహారం జరక్కపోతే మరింత పాతకానికి దారితీస్తుంది. మనవడి దారుణ హత్య జరిగిన తరవాత అగ్రవర్ణులు తక్కువ వర్ణంవారిని హింసించటమూ, శంకించటమూ అధికమయింది. అనేకమంది నీచవర్ణులను విద్రోహులని నిర్ణయించి తలలు కొట్టేశారు. అందులో చాలామంది నిజంగా విద్రోహులే అయి ఉండవచ్చు. మనవడి హత్యకు కారణం లేదుగాని ఆ తరవాత అగ్రవర్ణులు చేసిన ఘాతుకకృత్యాలకు అంతో

ఇంతో సమర్థింపు ఉంది. మనవణ్ణి చాలా గొప్పవాణ్ణి చేసి వాడిమీద పాటలు రాసి అగ్రవర్ణులు తమ మిగతా చర్యలను మాత్రం సమర్థించుకున్నారు. కాని నీచ వర్ణులను శత్రువులుగా చేసుకున్నది నిజానికి అగ్రవర్ణులే.

మనవడి చావుతో ఉన్న సమస్య పరిష్కారం కాకపోగా కొత్త సమస్య ప్రారంభమయింది. మనవడు చచ్చాడని నీచవర్ణులు నమ్మలేదు. వారిలోకొందరు మనవణ్ణి చూశామనీ, వాడితో మాట్లాడామనీ చెప్పసాగారు. మనవడు తమ వెంట అదృశ్యంగా ఉండి తమను రక్షిస్తున్నాడని కూడా వాళ్ళు నమ్మసాగారు. వాడికి అన్ని రకాల అమానుష శక్తులూ ఆపాదించి అద్భుతమైన పాటలు కట్టి అతి ఉద్రేకంతో పాడసాగారు. మనవడి మీద అగ్రవర్ణులు రాసిన కల్లబొల్లిపాటలు వీటి ముందర ఎందుకూ పనికొచ్చేవికావు. ఆ పాటలు పాడుతుంటే నీచవర్ణులంతా కూచుని నిశ్శబ్దంగా ఆలకించేవాళ్ళు. ఆడవాళ్ళు ఎక్కెక్కి ఏడిచేవాళ్ళు. మనవడి హత్య జరిగిన అమావాస్య వాళ్ళకి పుణ్యదినం. ఆ రోజు వాళ్ళెవరూ పచ్చి మంచినీళ్ళు తాగేవాళ్ళుకారు.

మనవడు పెద్దల్నడిగిన ప్రశ్నలకు సమాధానం రానేలేదు. నీచవర్ణం వాళ్ళు సభలు చేసినప్పుడల్లా ఈ ప్రశ్నలతోటే సభ ఆరంభమయేది. ఈ ప్రశ్నల అనంతరం కాస్సేపు అందరూ తలలు వొంచి నిశ్శబ్దంగా ఉండేవారు. తరవాత సభ సాగేది.

❀ ❀ ❀ ❀ ❀

నీచవర్ణంవాళ్ళని తమ ఆగర్భశత్రువులల్లే చూడటానికి వంక దొరికినాక అగ్రవర్ణులు వారిని అతి నీచంగా చూడసాగారు. ప్రతి చిన్న తప్పుకూ తల తీసెయ్యటమూ, వాళ్ళ యోగక్షేమాలను గురించి ఏమీ జాలి చూపకపోవటమూ పరిపాటి అయింది అగ్రవర్ణులకు. వాళ్ళు అగ్రవర్ణం వాళ్ళ పాటలు పాడే హక్కులేదు, అగ్రవర్ణం స్త్రీలకేసి చూసే హక్కు లేదు, ఆయుధాలు పట్టుకునే హక్కు లేదు, తిండి అగ్రవర్ణం వారితోసహా పంచుకునే హక్కులేదు, అగ్రవర్ణులు సుష్టుగా తిన్నాక మిగిలితే తినాలి, లేకపోతే పస్తుండాలి. ఇది శాసనం.

అగ్రవర్ణం వాళ్ళు నీచవర్ణపు స్త్రీలకు కడుపులు చెయ్యొచ్చు. నీచవర్ణంలో భార్యాభర్తలు సుఖంగా ఉంటే వారి పెళ్ళి రద్దు చేసి ఆ స్త్రీని మరో నీచవర్ణం వాడికి కట్టబెట్టవచ్చు. ఇది ఆచారం.

అయితే చిక్కేంవచ్చిందంటే ఈ అగ్రవర్ణం వారిలోనే ఈ శాసనాన్నీ ఆచారాన్నీ ప్రతిఘటించినవాళ్ళున్నారు.

"నీచవర్ణులపట్ల మనం ఎంత పశుప్రాయులుగా ప్రవర్తిస్తే మనం అంత సంస్కారం

కలవాళ్ళం అనే సిద్ధాంతం హేయమైనది" అని సంస్కారం గల అగ్రవర్ణం వాళ్ళు వాదించారు. కొందరు వాదించలేదు. చాటుగా నీచవర్ణులతో చేరిపోయి వాళ్ళకు సహాయపడసాగారు. ఇట్లా తమ పక్షం వహించిన అగ్రవర్ణులను నీచవర్ణులు కళ్ళకద్దుకుని స్వీకరించారు. ఇది నీచవర్ణులకు నష్టం కలిగించింది.

తమలో కొందరు నీచవర్ణుల పక్షం అవుతున్నారని తెలియగానే అగ్రవర్ణులు కొందరు విద్రోహులను నీచవర్ణుల దగ్గిరికి పంపారు. వీరు నీచవర్ణులకు విహితులల్లే వెళ్ళి వాళ్ళ రహస్యాలన్నీ ఆరాతీసి అగ్రవర్ణ నాయకులకు పట్టిచ్చారు. ఒకనాడు ముప్ఫైమంది నీచనాయకులకు వరసగా శిరచ్ఛేదం జరిగింది.

ఇది అగ్రవర్ణులు తక్కువ వాళ్ళకు చేసిన ఆఖరు అత్యాచారం. ఇది జరిగినాక ఉభయపక్షాలకూ మధ్య ఏ విధమైన బంధమూ లేకుండాపోయింది.

ఆ రాత్రే అగ్రనాయకులు ప్రయాణానికి ముహూర్తం పెట్టారు. ఏదైనా ఘోరం జరిగిన చోట నిద్ర చెయ్యకపోవటం వారి ఆచారం. ఎక్కడ నీచవర్ణులు దెబ్బతిన్నారో ఆ స్థలం వారు వెంటనే వొదిలిపోవాలి. లేకపోతే ఆ స్థల దేవత వారి కనుకూలించవచ్చు.

యాభై కుటుంబాలూ ప్రయాణ సన్నాహం జరిపినై. కాని నీచవర్ణులెవరూ కదలలేదు. వాళ్ళ ప్రస్థానం అయిపోయింది. అగ్రవర్ణులు మండిపోయినారు, నీచవర్ణులను బెదిరించారు. వారికి అమానుష శక్తుల భయం కూడా పెట్ట జూశారు. తమ వేదాల్లో నుంచి అందరు మానవులూ ఒక్కటేనని చదివి బుజ్జగించారు, బతిమాలారు. "మాకన్న ఒక విధంగా మీకే మనవి మీద గౌరవం ఉంది; అటువంటి మీరు ఆ మహాతల్లి శాసనం ఉల్లంఘిస్తారా?" అన్నారు.

నీచవర్ణులంతా ఒక్క సమూహంగా గుమికూడారు. పెద్దవాళ్ళు చెప్పినదంతా విన్నారు గాని వినిపించుకున్నట్టు కనపడలేదు. అనేక క్షణాలు గడిచినై. నిశ్శబ్దం.

"ఏమిటి మీ నిర్ణయం? చెప్పరేం?" అన్నారు నాయకులు.

"మహాప్రస్థానం ఈ నాటితో ముగిసింది. మన శాసనం ఇక అమలు జరుగుతుంది. మానవులు మహానగరం కడతారు" అన్నాడొక ముసలాడు ముందుకొచ్చి.

"ఎవరి అనుమతితో? ఎక్కడ?"

"మానవుల అనుమతితో ఇక్కడే. ఇక్కడ మానవులు కళ్ళు తెరిచారు. ఇక్కడ వాళ్ళకి వివేకం ఉదయించింది. ఈ కట్టబోయేనగరంలో అందరూ ఒక తల్లిబిడ్డలు ఉంటారు. కొందరిది అగ్రవర్ణమూ, కొందరిది నీచవర్ణమూగా ఉండదు. కాసేవాళ్ళవే పశువులు, పాలించే వాళ్ళదే బాధ్యత. ఈ నగరంలో ఏదన్నా తప్పులు జరిగితే నాయకులు

విచారించబడతారు, అనాథలు కాదు. ఈ నగరంలో వేదాలు ఉన్నదొకటి ఆచరణలో ఒకటికాదు. వేదాలు అమలు జరగటానికి వీలులేని పరిస్థితిలో వేదాలను మార్చటం జరుగుతుందిగానీ మనుషులను మార్చటం మటుకు జరగదు."

అగ్రనాయకులు ఒకరిమొహాలొకరు చూసుకున్నారు. వారికేమనాలో తెలియలేదు. యాభై కుటుంబాల అగ్రత్వమూ అనుకోనివిధంగా అంతమయిపోయింది. ఆ విషయం వారికి అవగాహన కావటం చాలా కష్టమయింది.

***మొదటి ముద్రణ: ఆంధ్రజ్యోతి మాసపత్రిక, సెప్టెంబర్ 1948***